క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ ఐటీఐలో రెండేళ్ల కోర్సులలో ప్రవేశానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ పైల జవహర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రికల్ మెకానిక్, డ్రాఫ్ట్‌మేన్ సివిల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 94928 43849, 99081 61336 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



బాసుబంజిరిలో మినీవాటర్ స్కీంను ప్రారంభిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: బొగాబెణి పంచాయతీ పరిధి బాసు బంజిరి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం పంచాయతీ నిధులు రూ. 3.5 లక్షల అంచనా వ్యయంతో ప్రజా విశ్రాంతి మండపాన్ని, రూ. రెండు లక్షలు అంచనా వ్యయంతో బోరు, మినీ వాటర్ ట్యాంకు సిస్టంలను పంచాయతీ సర్పంచ్ గణప సింహాచలం, ఎంపీటీసీ సభ్యుడు బొండాడ వైకుంఠరావుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు లడ్డు కేశవపాత్రో, దుర్గాసి ధర్మారావు, కొణపల సురేష్‌కుమార్, తలగాన తిరుపతిరావు, డొక్కరదాలయ్య, డొక్కర బలరాం, వంకల దుర్యోధన పాల్గొన్నారు.

మండల పరిషత్ నిధులతో గ్రామాభివృద్ధి



కర్తలిపాలెంలో సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. కర్తలిపాలెం గ్రామంలో నిర్మించిన సామాజిక భవనం, సామాజిక మండపం, వాటర్ ట్యాంకులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ, మండల పరిషత్ నిధులు ఉపయోగించుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుడు మంగి గణపతి, సర్పంచ్ పొందూరు గున్నయ్య, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు శిలగాన భాస్కరరావు, గ్రామపెద్దలు బాబురావు, జ్ఞానేశ్వరరావు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



సమావేశంలో సీఐటీయూ ప్రతినిధులు

టెక్కలి: పెట్టుబడిదారులకు మేలు కలిగే విధంగా అమలు చేసిన లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను స్థానికంగా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎన్.షణ్ముఖరావు కోరారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన లేబర్ కోడ్ చట్టాల వలన ఎంతో మంది అసంఘటిత కార్మికులు నడిరోడ్డున పడుతున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో తేజేశ్వర్రావు, వి.ధనుంజయరావు, ఎల్.రామ్మూర్తి, బోసు, కె.ఎల్లయ్య, బి.కృష్ణారావు, టి.సూర్యనారాయణ ఉన్నారు.

మాల ఉద్యోగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



కరపత్రాలను ప్రదర్శిస్తున్న సంఘ ప్రతినిధులు

టెక్కలి: జిల్లా మాల(ఎస్సీ) ఉద్యోగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం టెక్కలిలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు, ఉపాధ్యక్షుడు స్వర్ణ నరసింహామూర్తి, జిల్లా నాయకులు చల్లా రామారావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణకు సిద్ధం కావడంపై ఉద్యమించాలని కోరారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఎస్సీల్లో వెనుకబడిన కులాలను అభివృద్ధి చేయాలని చెబితే దీనికి విరుద్ధంగా వర్గీకరణ చేసేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై ఐక్యంగా పోరాటం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు.

ఇవేం మరమ్మతులు!

- పూర్తిగా శిథిలమైన రోడ్డుకు మరమ్మతులతో సరి
- ఎన్నాళ్లు నిలుస్తాయోనని పెదవి విరుస్తున్న జనం
- పూర్తిస్థాయిలో నిర్మించాలంటూ డిమాండ్



మెయిన్‌రోడ్డుకు నామమాత్రంగా చేపట్టిన మరమ్మతులు

మఠం కంచిలి వద్ద మరమ్మతులు ఇలా..

కంచిలి: మండల కేంద్రం కంచిలి మెయిన్ రోడ్డులో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల చేపట్టిన మరమ్మతులపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. పూర్తిగా పాడైన రోడ్డుకు కేవలం మరమ్మతులు చేసి విడిచిపెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రానికి రోజూ వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు రోడ్డుకు చేపట్టిన నామమాత్రపు మరమ్మతుల తీరుపై ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఎక్కడికక్కడ గోతులు, పగుళ్లు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. చాలాకాలంగా మరమ్మతులు చేపట్టపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. కొంతమంది రోడ్డును సైతం ఆక్రమించేశారు. పెద్ద ఎత్తున రోడ్డుకు ఇరువైపులా ఇసుక మేటలు వేసింది. ఫలితంగా రోడ్డు పూర్తిగా స్వరూపం కోల్పోయింది. దీనికితోడు గత నెలలో రోడ్డు పక్కన కేబుల్ కోసం తవ్వకాలు చేపట్టడంతో మరింత దారుణంగా తయారైంది. ఈ తరుణంలో ప్రస్తుతం చేస్తున్న మరమ్మతులు కూడా పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు ఎప్పటి వరకు నిలుస్తాయోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జూన్ నెలలో మండల కేంద్రం కంచిలిలో చేపట్టనున్న కంచమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాల నేపథ్యంలో ఆదరాబాదరాగా ఈ మరమ్మతులు చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో కంటితుడుపు చర్యగా చేపట్టిన పనులు ఎంతకాలం నిలుస్తాయో చెప్పలేని పరిస్థితి. రైల్వే ఫీడర్ నుంచి బైపాస్ రోడ్డు కూడలి వరకు సుమారు రెండున్నర కిలోమీటర్లు పొడవుగల ఈ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టాలి



కంచిలి మండల కేంద్రం మెయిన్‌రోడ్డును కేవలం మరమ్మతులతో సరిపెట్టకుండా పూర్తిస్థాయిలో చేపట్టాలి. ప్రస్తుతం చేపట్టిన పనులతో సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్న రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి.

-బతకల ధర్మారావు, కంచిలి

అరకొర పనులు సరికాదు



కంచిలి మెయిన్‌రోడ్డుకు ఇటీవల చేపట్టిన మరమ్మతులు సక్రమంగా లేవు. అరకొర పనులతో సరిపెట్టారు. ఈ పనులు ఎక్కువ కాలం నిలిచే పరిస్థితి కన్పించడం లేదు. దీనివల్ల ప్రయోజనం లేదు. పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టాలి. రోడ్డు నిర్మాణం కోసం మంజూరైన నిధులను సత్వరమే ఖర్చుచేసి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలి.

-పైల దేవదాస్‌రెడ్డి, ఎంపీపీ, కంచిలి

కళలను ప్రోత్సహించాలి



ఎంపీపీ నిమ్మన దాస్‌ను సత్కరిస్తున్న కళాకారుల సంఘ ప్రతినిధులు

సోంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళలను ప్రోత్సహించి కళాకారులను గుర్తించాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. ఉప్పలాం పంచాయతీ ఎకువూరు గ్రామంలో సోంపేట కళాభారతి కళాకారుల సమైఖ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సంగీత విభావరి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కళాకారుల గీతాలాపనలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా కళాభారతి కళాకారులు ఎంపీపీ దాస్‌ను దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బట్టి మాధవరావు, కళాభారతి సంఘ ప్రతినిధులు ఎస్.నూకరాజు, శివాజీ పాణిగ్రాహి, పిరియా రామారావు, పండా మాస్టార్, డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సురపు రాజు

పలాస: స్థానికంగా ఉన్న సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటే పేదరికం ఉండదని ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంటు స్టడీస్ సీనియర్ కన్సల్టెంట్ ప్రొఫెసర్, యునెస్కో ప్రాజెక్టు కోఆర్డినేటర్ సురపు రాజు అన్నారు. నీలావతి గ్రామంలోని యూవీవీ గ్రంథాలయంలో పేదరికం, వలసలు, నిర్మూలన అనే అంశంపై ఆదివారం సదస్సు జరిగింది. యూవీవీ అధ్యక్షుడు బొమ్మాళి శివ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఉద్దానం ప్రాంతంలో చాలా సహజ వనరులు ఉన్నాయన్నారు. వాటిని వినియోగించుకోవడంలో లోపం ఉండటం వల్ల ఈ ప్రాంతంలో పేదరికం ఉందని, ఫలితంగా వలసలు పెరుగుతున్నాయని చెప్పారు. నిరక్షరాస్యత, వాతావరణలో మార్పులు, తగిన సాంకేతిక నైపుణ్యం లేకపోవడం వల్ల ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ వనరులను ఉపయోగించుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, ఫలితంగా తలసరి ఆదాయం పెరుగుతోందన్నారు. ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ టి.ఆనంద్ మాట్లాడుతూ.. పేదరికం వల్ల కొంతమంది వలస పోతుంటే మరికొంత మంది విద్యావంతులు మన దేశంలో చదివి ఇతర దేశాలకు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు మారాలన్నారు. కార్యక్రమంలో యూవీవీ గౌరవ అధ్యక్షుడు కుత్తుం ప్రకాశరావు, సీతారాం, కుత్తుం సుధాకర్, పోతనపల్లి మాధవరావు, కుత్తుం వినోద్, తెప్పల వాసు, చొక్కర నరహరి, వివిధ గ్రామాలకు చెందిన విద్యావంతులు పాల్గొన్నారు.

జేఎస్ రోడ్డుకు మరమ్మతులు



రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

కవిటి: మండల పరిధిలోని జగతి-శిలగాం-గొర్లెపాడు జంక్షన్ రోడ్డు మరమ్మతులకు గురైంది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి మరమ్మతులు చేపడుతుండడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నేటి నుంచి మున్సిపాలిటీ ప్రజలకు నీటి సరఫరా

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో నెల రోజులుగా ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను అధిగమించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఉద్దానం నీటి ప్రాజెక్టుని మున్సిపాలిటీ నీటిసరఫరా పంప్‌హౌస్‌కి అనుసంధానం చేసే పనులు పూర్తయ్యావని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి ప్రజలకు సమస్య లేకుండా కుళాయిల ద్వారా నీటి సరఫరాను చేయనున్నట్లు చైర్‌పర్సన్ పేర్కొన్నారు.

పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



పంచముఖ ఆంజనేయ ఆలయం

పలాస: టెక్కలిపట్నం గ్రామంలో పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహా ప్రతిష్ట కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో ఆదివారం జరిగింది. శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో స్వామి ఆలయం, విగ్రహ ప్రతిష్ట మల్లా తిరుపతిరావు దాతృత్వంతో నిర్వహించారు. వేదపండితుల సమక్షంలో యజ్ఞం ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇందుకోసం ఆలయ దాత తిరుపతిరావు రూ.3 లక్షలు వెచ్చించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన జరిగింది. ఆలయ అర్చకులు సంతోష పండా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సమన్వయ లోపం.. ప్రజలకు శాపం!

- విస్తరణకు నోచుకోని ఇందిరాచౌక్-మొగిలిపాడు రోడ్డు
- మున్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖల సమన్వయ లోపమే కారణం
- అవస్థలు ఎదుర్కొంటున్న ప్రజలు



విస్తరణకు నోచుకోని ఇందిరాచౌక్-మొగిలిపాడు రోడ్డు

కాశీబుగ్గ: రెండు శాఖల అధికారుల మధ్య సమన్వయలోపం ప్రజలకు శాపంగా మారింది. గ్రేడ్-2 మున్సిపాలిటీగా మారిన పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలోని ఇందిరాచౌక్-మొగిలిపాడు రోడ్డు అనేక సంవత్సరాలుగా విస్తరణకు నోచుకోలేదు. దీంతో ప్రజలు భారీగా పెరిగిన ట్రాఫిక్‌తో అవస్థలు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డు విస్తరణ జరగడం లేదనే విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రధానమైన ట్రాఫిక్ సమస్యలలో కాశీబుగ్గ ఎల్‌సీగేటు సమస్య ఒకటైతే.. రెండోది పలాస ఇందిరాచౌక్ నుంచి మొగిలిపాడు వరకు ఉన్నటువంటి రోడ్డు. 20 ఏళ్ల క్రితం మున్సిపల్ చైర్మన్‌గా వ్యవహరించిన వజ్జ బాబూరావు హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఈ రోడ్డును విస్తరించారు. అ తరువాత ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోలేదు. పెరిగిన జనాభా, వాహనాలను దృష్టిలో పెట్టుకొని ఈ రోడ్డును విస్తరించాల్సిన అవసరం చాలా ఉంది. అయితే ఎవరూ దీనిగురించి కనీసం పట్టించుకోవడం లేదు. ఫలితంగా ట్రాఫిక్‌తో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఇరవై ఏళ్లలో రెండు పర్యాయాలు విస్తరణ జరిగినా ఇందిరా చౌక్ నుంచి మొగిలిపాడు వరకు ఉన్నటువంటి రోడ్డును మాత్రం విస్తరించలేదు. ఈ భాగం ఆర్‌అండ్‌బీ శాఖ అధీనంలో ఉండటంతో మున్సిపాలిటీ వారు ముట్టుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రజల నుంచి డిమాండ్ ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు వెనుకంజ వేస్తున్నారు. మరో ఏడాదిలో మున్సిపల్ ఎన్నికలు ఉండడంతో రోడ్డు విస్తరణకు నాయకులు కూడా ఆసక్తి చూపడం లేదు. రాజకీయాలను పక్కనపెట్టి రెండు శాఖలను సమన్వయపరిచి రోడ్డును విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇరుకైన రోడ్డే గతి..



ఇరుక రోడ్డుతో అవస్థలు పడుతున్నాం. ప్రస్తుతం ఈ రోడ్డే గతి. ఇందిరాచౌక్ నుంచి జూనియర్ కళాశాల వరకు ఉన్న రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. జీడి పరిశ్రమలు, విద్యా సంస్థలు, కార్యాలయాలకు వెళ్లే వారికి ఈ రోడ్డే ఆధారం. ఇప్పుడు ఆర్టీసీ బస్సులు సైతం ఇచ్ఛాపురం నుంచి వస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నాం. ఈ రోడ్డు సగం మున్సిపాలిటీ.. మరో సగం ఆర్‌అండ్‌బీ శాఖ ఆధీనంలో ఉంది. ఇరు శాఖల అధికారులను సమన్వయపరిచి రోడ్డును విస్తరించాలి.

– మల్లా సురేష్,
పలాస కాషూ్య మాన్యుఫ్యాక్షర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు

రోడ్డు విస్తరణ అవసరం



ఇందిరాచౌక్ నుంచి జూనియర్ కళాశాల వరకు మాత్రమే రోడ్డు విస్తరణకు సమస్యలు ఉన్నాయి. మిగిలిన భాగం అనుకూలంగా ఉంది. గతంలో 80 అడుగులు విస్తరించాలని భావించినప్పటికీ స్థానికుల అభిప్రాయం మేరకు 60 అడుగుల విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేసినప్పటికీ ఈ ప్రక్రియ మధ్యలోనే ఆగిపోయింది. మున్సిపాలిటీ పరిధిలో సగం రోడ్డు ఉండగా.. మిగిలినది ఆర్‌అండ్‌బీ శాఖ అధీనంలో ఉంది. విస్తరిస్తున్న పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అవసరమైన ఈ రోడ్డు విస్తరణ చాలా అవసరం. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా.

-నడిపేన రామారావు,
కమిషనర్, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

ఉత్సవాలకు శుభరాట



మండల కేంద్రం కంచిలిలో జూన్ ఒకటో తేదీ రాత్రి నుంచి పదో తేదీ వరకు గ్రామదేవత కంచమ్మతల్లి అమ్మవారి ఉత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఉత్సవ నిర్వహణ పనులకు కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు. స్థానిక శివాలయం నుంచి ఊరేగింపుగా భక్తులంతా వచ్చి, మెయిన్‌రోడ్డు మీద రైల్వేస్టేషన్ కూడలి వద్ద ఉన్న అమ్మవారి పీఠ స్థానం వద్ద ఆదివారం శుభరాట వేశారు. కార్యక్రమంలో పాల్గొన్న 108 మంది మహిళలకు చీర, గాజులు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలతో ఫలదానం ఇచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. -కంచిలి

భయపెడుతున్న శునకాలు



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో కుక్కలు మందలుగా పెరిగిపోతున్నాయి. గుంపులుగా తిరుగుతూ జనాలను భయపెడుతున్నాయి. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ దుకాణాల వద్ద సంచరిస్తూ జనాలపై దాడులకు పాల్పడుతున్నాయి. వీటి నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

-కాశీబుగ్గ

చింతామణికి సంబరాలు



ఉద్దానం ప్రాంతీయుల ఆరాధ్యదైవం కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి ఆదివారం వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మొక్కుబడులు తీర్చుకునే క్రమంలో భాగంగా ఘనంగా సంబరాలు చేశారు. అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను మేళతాళాలతో కాళికావేషధారణలతో అమ్మవారిని కవిటి పట్టణ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో విశేష పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. -కవిటి

గురువులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: తమకు ఓనామాలు నేర్పించి, తమ భవిష్యత్తుకు మార్గదర్శులుగా ఉంటూ ప్రయోజకులుగా తీర్చిదిద్దిన గురువులను గుండెల్లో దాచుకున్న పూర్వ విద్యార్థులు 14 ఏళ్ల తరువాత వారితో ఆత్మీయతను పంచుకున్నారు. మండలం ఈదుపురం ఉన్నత పాఠశాలకు చెందిన 2010-11 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులను నేర్పించిన అప్పటి గురువులు చిట్టిబాబు, సుబ్బలక్ష్మి దంపతులతో పాటు మరో ఏడుగురు ఉపాధ్యాయులను ప్రత్యేక వేదికపై ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి విషయాలను ఒకరితో ఒకరు పంచుకొని ఆనంద భరితులయ్యారు.

వైద్యానికి ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు రూరల్: బావనపాడు గ్రామానికి చెందిన బత్సల క్రిష్ణమూర్తి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న హ్యాండ్ టుగేదర్ ట్రస్ట్ ప్రతినిధులు బాధితునికి రూ.40 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. పేదరికంతో పాటు వ్యాధితో బాధపడుతున్న క్రిష్ణమూర్తి వైద్యానికి ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. కాగా క్రిష్ణమూర్తి ఆరోగ్యం త్వరగా కోల్కోవాలని ఆకాంక్షించారు. ఈ ఆర్థిక సాయం అందించిన వారిలో ట్రస్ట్ ప్రతినిధులు ఆదినారాయణరావు ,గణపతి,కూర్మారావు,గౌరి తదితరులు ఉన్నారు.

సముద్ర జీవులను సంరక్షించాలి



తాబేళ్ల పిల్లలను సముద్రంలోనికి విడిచి పెడుతున్న ప్రకృతి ప్రేమికులు

వజ్రపుకొత్తూరు రూరల్: సముద్ర సమతుల్యాన్ని కాపాడుతున్న అరుదైన సముద్ర జీవులను సంరక్షించాలని అటవీశాఖ వలంటీర్ జి.వాసు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శశిభూషణ్ అన్నారు. చినకొత్తూరు తీరంలో ఏర్పాటు చేసిన హేచరీలో పొదిగిన ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను ఆదివారం అటవీశాఖ, ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అదే సముద్ర తీర జలాల్లో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతరించిపోతున్న అరుదైన సముద్ర జీవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఇప్పిలి హేమసుందర్, కె.శేషు, వంక జగదీష్, పి.తులసీ, ఉమేష్, ఇప్పిలి గోవింద ఉన్నారు.

వెలుతురు లేక.. ఎవరూ పట్టించుకోక



లైట్లు లేక చీకటిగా ఉన్న ఆస్పత్రి నూతన ప్రవేశ ద్వారం

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రికి రాత్రి సమయంలో వెళ్లే రోగులు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రికి గతంలో ఉన్న మార్గం మూసి ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన మార్గం వెంబడి రోగులు రాకపోకలు సాగిస్తున్నారు. వెలుతురు ఉన్న గేట్లు మూసివేసి కటిక చీకటి ఉన్న మార్గం వెంబడి వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రిపూట విధులు ముగించుకుని వెళ్తున్న వారు సైతం ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెలుతురు ఉన్న మార్గం తెరిపించాలని లేదంటే చీకటి మార్గంలో లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అలరించిన కోలాటం



కోలాటం ఆడుతున్న మహిళలు

ఇచ్ఛాపురం రూరల్: బాలకృష్ణాపురం గ్రామంలో జరుగుతున్న గీతా యజ్ఞం, రాధాకృష్ణుల మందిరం ప్రతిష్ట సందర్భంగా ఆదివారం ప్రదర్శించిన మహిళల కోలాటం భక్తులతో పాటు స్థానిక ప్రజల్ని అలరించింది. మహిళలు శ్రీరాముల భక్తి గీతాలకు లయబద్ధంగా అడుగులు వేస్తూ నృత్యాన్ని ప్రదర్శించారు.

గీతా యజ్ఞాన్ని దర్శించుకున్న ఒడిశా ఎమ్మెల్యే

ఇచ్ఛాపురం రూరల్: బాలకృష్ణాపురం గ్రామంలో జరుగుతున్న గీతా యజ్ఞాన్ని ఒడిశా చీకటి ఎమ్మెల్యే మున్నా సామంత రాయ్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌లు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక కళ్యాణం కోసం యజ్ఞ, యాగాదులు నిర్వహిస్తే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని అన్నారు.